## జిల్లాకు ప్రొబెషనరీ ఐపీఎస్



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న కాజల్

కామారెడ్డి, జనవరి 11 : జిల్లాకు ప్రొబెషనరీ ఐపీఎస్‌గా కాజల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 75 ఆర్ఆర్ 2022 బ్యాచ్‌కు చెందిన కాజల్ ఉత్తరప్రదేశ్ వాసి. ఆరు నెలలపాటు ప్రొబెషనరీ ఆఫీసర్‌గా కామారెడ్డిలో విధులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో జిల్లా పరిస్థితులపై పలు అంశాలు చర్చించారు.

## క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

కామారెడ్డి, జనవరి 11 : కామారెడ్డి జిల్లా నుంచి ఈ నెల 12, 13, 14వ తేదీల్లో సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని లయోలా అకాడమీ పాఠశాలలో ఎంపికైన 24 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంబాల రవి యాదవ్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి రంగ వెంకటేశ్వర్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, బ్రహ్మరాజు, మధుసూదన్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఫయాం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

బాన్సువాడ, జనవరి 11 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇగ్నైట్ పోటీల్లో బోర్లం క్యాంపు గురుకుల విద్యార్థినులు సత్తాచాటారు. గురుకుల పాఠశాలలో చదువుతున్న త్రిష, సంధ్య, దీక్షిత, భవ్యశ్రీ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. గురుకులాల సంస్థ సెక్రటరీ నవీన్ నికోలస్ విద్యార్థినులను అభినందించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌ను జిల్లా సమన్వయాధికారిణి అలివేలు అభినంధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పద్మకుమారి, ఉపాధ్యాయినులు సునిత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## 'సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపి వేయాలి'

కామారెడ్డి, జనవరి 11 : జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఓ బిల్డింగ్ పై ఓ సంస్థకు చెందిన సెల్ టవర్ నిర్మాణ పనులు ఆపాలని రామారెడ్డి రోడ్డులోని కాలనీ వాసులు గురువారం రోడ్డుపై ధర్నా నిర్వహించారు. రేడియేషన్‌తో ప్రమాదం పొంచి ఉందని గతంలో కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని ఎవరూ పట్టించుకోలేదన్నారు. పోలీసులు వచ్చి వారిని సముదాయించి ధర్నా విరమింపజేయించారు.

## 'కలిసికట్టుగా పనిచేయాలి'

కామారెడ్డి, జనవరి 11 : జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ గెలుపునకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే, జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, రాష్ట్ర నాయకులు మురళీధర్ గౌడ్, నీలం చిన్న రాజులు పాల్గొన్నారు.

# నవోదయ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి, జనవరి 11 : నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20న నిర్వహించనున్న పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రవేశ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2,689 మంది బాలబాలికలు ప్రవేశ పరీక్ష రాయనున్నారని, ఇందుకోసం బాన్సువాడ, దోమకొండ, కామారెడ్డి, బిచ్కుంద, ఎల్లారెడ్డి ప్రాంతాల్లో 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ సత్యవతి, డీఎస్పీ మదన్‌లాల్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ భార్గవ్, డీఈవో, డీపీవో, మున్సిపల్ కార్యాలయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు**

కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఆవరణలో టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో గురువారం మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ హాజరై మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా మహిళలు ఇంటి ముందు ముగ్గులు వేసి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తారని తెలిపారు. అనంతరం గెలుపొందిన పలువురికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారిణి రజిత, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సాయిలు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్, సాయిరెడ్డి, చక్రధర్, సాయిలు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా ఒడ్డె ఓబన్న జయంతి**

జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒడ్డె ఓబన్న జయంతిని గురువారం అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడ్డె ఓబన్న చిత్ర పటానికి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, వడ్డెర సంఘం ప్రధాన కార్యదర్శి సూర్యరాజం, ప్రతినిధులు శ్రీనివాస్, మధుసూదన్, కొమురయ్య, రమేశ్, బాలయ్య, బీసీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు



నస్రుల్లాబాద్ మండలం నెమ్లిలో భోగి మంట చుట్టూ కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

ఎల్లారెడ్డి/ సదాశివనగర్/ పిట్లం/ బీబీపేట్/దోమకొండ/నస్రుల్లాబాద్/ కామారెడ్డి రూరల్, జనవరి 11: జిల్లాలోని పలు పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలను గురువారం ఘనంగా నిర్వహించారు. సదాశివనగర్ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ భానుమతి ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహిం చి బహుమతులు అందజేశారు. పిట్లంలోని బోయివాడ పాఠశాల, బ్లూబెల్స్ హైస్కూల్‌లో కైట్ ఫెస్టివల్, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం నారాయణ, బ్లూబెల్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిలోని కేటీఎస్‌లో ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు.



ఎల్లారెడ్డి కేటీఎస్‌లో ముగ్గు వేసిన విద్యార్థినులు

# పక్షుల వలసలపై అధ్యయనం



పక్షుల వలసలను అధ్యయనం చేస్తున్న మాందాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

బీబీపేట్, జనవరి 11 : మండలంలోని మాందాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బీబీపేట్ పెద్ద చెరువు బ్యాక్ వాటర్ వద్దకు వలస వచ్చిన పక్షులను ఉపాధ్యాయులతో కలిసి గురువారం అధ్యయనం చేశారు. అక్కడకు వచ్చిన కొన్ని మైగ్రేట్ బర్డ్స్‌ను గుర్తించారు. బారాటెడ్, బ్రాహ్మిణి, నార్దెన్ పింటెల్, బ్లాక్ వింగుడ్, శిక్ర తదితర పక్షులను అధ్యయనం చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పవన్‌కుమార్, బాబు, విజయనంద్, కృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరికి బ్యాటరీ ట్రైసైకిళ్ల అందజేత



సైకిళ్లను అందజేసిన డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ, జనవరి 11 : బాన్సువాడలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తన స్వగృహం వద్ద ఇద్దరు దివ్యాంగులకు గురువారం బ్యాటరీ ట్రై సైకిళ్లను అందజేశారు. బాన్సువాడ మండలం దేశాయిపేట్‌కు చెందిన రాజు, బీర్కూర్‌కు చెందిన సయ్యద్ షబ్బీర్‌కు బ్యాటరీ ట్రై సైకిళ్లను అందజేశారు. ఎంపీపీ రఘు , సొసైటీ అధ్యక్షుడు ఏర్వాల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సందీప్, బీఆర్ఎస్ నాయకుడు దొడ్ల వెంకట్రామ్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్, ఎజాస్, శివ, ఆరిఫ్, మన్నన్, మైనార్టీ నాయకులు వాహబ్, అంజయ్య, వనం గంగాధర్, నరహరి, ప్రశాంత్, ఖరీం, ఎంపీటీసీ వెంకటరమణ, గోపాల్, ఖరీం తదితరులు ఉన్నారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

బాన్సువాడలోని మదీన కాలనీలో భగవాన్ కమిటీ అధ్యక్షుడు ఖాదీర్ ఇంట్లో సోమవారం కరెంట్ షాక్‌తో ఫర్నిచర్ ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన

బీబీపేట్, జనవరి 11 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఎమ్మెల్సీ కూర రఘోత్తమ రెడ్డి గురువారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్సీని ఉపాధ్యాయులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.రామేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

నస్రుల్లాబాద్, జనవరి 11 : బీర్కూర్ మండలం వీరాపూర్, రైతునగర్ గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి శివకుమార్, ఆరోగ్య సిబ్బంది వినోద్, పద్మలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

మాచారెడ్డి, జనవరి 11 : మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలంగాణ వంటకాలతోపాటు పౌష్టికాహారం, ప్రొటీన్లతో కూడిన ఆహార పదార్థాలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## షాపింగ్ కాంప్లెక్స్‌లు స్వాధీనం చేసుకుంటాం

మాచారెడ్డి,జనవరి 11 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్ రోడ్‌లోని శ్రీవీరహన్‌మాన్ ఆలయం ప్రాంగణంలో నిర్మించిన 20 షాపింగ్ కాంప్లెక్స్‌లు దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంటుందని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ అన్నారు. గురువారం ఆలయాన్ని సందర్శించి ఆలయ కమిటీ, దాతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లను స్వాధీనం చేసుకుంటామని, దాతల సహకారంతో నిర్మించిన కాంప్లెక్స్ నిర్మాణాల పూర్తి వివరాలు సేకరించామని అన్నారు. ఆమె వెంట ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ చైర్మన్లు లక్ష్మారెడ్డి, శ్రీనివాసాచారి, సర్పంచ్ హంజీనాయక్, ఈవోలు ప్రభు, రవీందర్, శ్రీధర్ సిబ్బంది ఉన్నారు.

## యువజనోత్సవాలకు బయల్దేరిన వలంటీర్లు

భిక్కనూరు, జనవరి 11: జాతీయ స్థాయి యువజనోత్స వాలకు సౌత్ క్యాంపస్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురువారం బయల్దేరారు. 12 నుంచి 16వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించే జాతీయస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు సౌత్ క్యాంపస్ ఎన్ఎస్ఎస్ 5 వ యూనిట్ వలంటీర్లు శివకుమార్, పవన్ బయల్దేరి వెళ్లారు. సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అంజయ్య, అధ్యాపకులు రాజేశ్వరి, వీరభద్రమ్ శ్రీనివాస్, నాగరాజు, మోహన్‌బాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మక్కజొన్నలో భాస్వరం లోప నివారణ చర్యలు చేపట్టాలి

- ఎల్లారెడ్డి ఏడీఏ రత్న
- యాసంగి పంటల పరిశీలన

గాంధారి, జనవరి 11: మండలంలోని గండివేట్, సీతాయిపల్లి శివారుల్లో రైతులు యాసంగిలో సాగుచేస్తున్న పలు రకాల పంటలను ఎల్లారెడ్డి ఏడీఏ రత్న గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు సాగుచేస్తున్న మక్కజొన్న పంటలో భాస్వరం లోపంతోపాటు, కాండం తొలుచు పురుగు ఆశించినట్లు తెలిపారు. భాస్వరం లోపం నివారణకు ఎన్‌పీకే పోషకాలు ఉన్న 28:28:0 అనే మందును లేదా 19:19:19 అనే మందును ఎకరానికి ఒక కేజీ చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. కాండం తొలుచు పురుగు నివారణకు ఎమ్మామెక్టిన్ బెంజోయేట్ 5 శాతం మందును ఎకరానికి వంద గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని తెలిపారు. అనంతరం గండివేట్ గ్రామంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఉన్న ఎరువులను ఆమె పరిశీలించారు. రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలని సింగిల్ విండో పాలకవర్గ సభ్యులు, సిబ్బందికి సూచించారు. రైతులు యాసంగిలో సాగు చేస్తున్న పంటల వివరాలను వ్యవసాయాధికారుల వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నరేశ్, ఏఈవో జోత్స్న తదితరులు పాల్గొన్నారు.



సీతాయిపల్లి శివారులో పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రత్న

## పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం

గాంధారి, జనవరి 11: బీజేపీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని గాంధారిలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. సమావేశానికి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

## క్యాలెండర్ల ఆవిష్కరణ

నిజాంసాగర్, జనవరి11: నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. గెజిటెడ్ హెచ్ఎం వెంకట్రాం రెడ్డి, సంఘం జిల్లా బాధ్యుడు యాదయ్య, ప్రధాన కార్యదర్శి అయ్యాల సంతోష్, ఉపాధ్యాయులు సత్యభూషన్, సమత, సంగీత, గీత, వరలక్ష్మి, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 11: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. పట్టణంలోని జీవదాన్ హైస్కూల్‌లో స్పోర్ట్స్‌మీట్‌ను ప్రిన్సిపాల్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ జోబిష్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా పలు రకాల పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి నియోజకవర్గానికి రూ.పది కోట్లు మంజూరు

**ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు**

ఎల్లారెడ్డి, జనవరి 11: ఎల్లారెడ్డి నియోజక వర్గంలో అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేనిధుల నుంచి పది కోట్ల రూపాయలను మంజూరు చేశారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని తాను ఇటీవల కలిసి నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించినట్లు తెలిపారు. దీంతో సీఎం స్పందించి రూ.పది కోట్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక నిధులతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బెంచీల ఏర్పాటు, రోడ్లు, ప్రభుత్వ బడులకు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

## కొత్తపల్లికి తరలిన గిరిజనులు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 11: మండలంలోని సోమిర్యాగడితండాకు చెందిన పలువురు గిరిజనులు ఆదిలాబాద్ జిల్లా కొత్తపల్లి గ్రామానికి గురువారం తరలివెళ్లారు. కొత్తపల్లిలో బంజారాల గురువు ప్రేమ్ సింగ్ మహరాజ్ తపస్సు చేసిన స్థలంలో నిర్వహిస్తున్న ఆలయ నిర్మాణ భూమిపూజకు వెళ్తున్నట్లు తెలిపారు. కొత్తపల్లికి వెళ్లిన వారిలో సేవాఘడ్ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పాత్లోత్ గోవింద్, వైస్ చైర్మన్ బన్సియా, సోమిర్యాగడితండా, పల్లెబొగుడ తండా సర్పంచులు మాలోత్ లచ్చానాయక్, అంగోత్‌బద్దీ శంకర్‌నాయక్, భక్తులు నంద్యానాయక్, రాజు, పీర్యా, సక్రియా, బుజ్యా, వసూరాం, పర్సు, సర్దార్, మోహన్, అజ్మీరా నగేశ్ తదితరులు ఉన్నారు.

# ఆత్మ జ్ఞానోదయంతో మానవాళికి విముక్తి

- ఎంపీ బీబీ పాటిల్
- ముగిసిన విశ్వశాంతి గీతాజ్ఞాన యజ్ఞం




మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్

సదాశివనగర్, జనవరి 11: ఆత్మ జ్ఞానోదయంతో సమస్త మానవాళికి విముక్తి లభిస్తుందని ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. మండలంలోని లింగంపల్లి శ్రీకృష్ణ మందిరంలో మూడు రోజులపాటు నిర్వహించిన విశ్వశాంతి గీతా జ్ఞాన యజ్ఞం గురువారంతో పరిపూర్ణమైంది. ఈ సందర్భంగా ఎంపీ పాటిల్ పాల్గొని మాట్లాడారు. యజ్ఞం నిర్వహించిన మాచాలే బాబాను అభినందించారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, బాబాలు పాల్గొన్నారు. ఆలయ పీఠాధిపతి మచాలే బాబా, మహంత్ కన్హైరాజ్ బాబా, మనోహర్ బాబాకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమాలకు గ్రామస్తులు తమ సేవలను అందించారు.

## భవన నిర్మాణ కార్మిక రంగ సభ్యుల సమావేశం

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 11: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట్ శివారులో భవన నిర్మాణ రంగ కార్మిక సంఘ సభ్యుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమా వర్తింపజేయాలని, పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘ భవన నిర్మాణం, సంఘం అభివృద్ధి తదితర విషయాలపై చర్చించారు. సభ్యులు లక్ష్మణ్, సాయిబాబు, శ్యాం, కాంతారావు, రామ్మోహన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★My Old Surname/Name was **GAPPALA NAVEEN KUMAR** now my new Surname/ Name as **GAPPALA NAVEEN** H.No.1-94, G.G.Nadkuda, (M) Donkeshwar, (D) Nzb.
**NTZ-318896**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## సంగవ్వకు యూనియన్ బ్యాంక్ పరిహారం, ఖర్చులు చెల్లించాలి

**వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పు**

నిజామాబాద్ లీగల్, జనవరి 11 : తాడ్వాయి మండలకేంద్రానికి చెందిన దేమి సంగవ్వ టెంట్ హౌస్ స్వయం ఉపాధి కోసం కామారెడ్డి జిల్లా షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్ ద్వారా రుణం కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ.. ఆమెకు అనుకూలంగా రూ. 6 లక్షల రుణ సదుపాయం కల్పిస్తూ ప్రొసీడింగ్‌ను 29 జనవరి, 2018న జారీ చేసింది. తాడ్వాయిలోని ఆంధ్రాబ్యాంకు (ప్రసుత్తం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)కు ఉత్తర్వులు పంపించారు. రూ. 6లక్షల లోన్‌లో ప్రభుత్వ సబ్సిడీ రూ. 3.60 లక్షలుగా నిర్ధారించారు. బ్యాంకర్ ఆదేశాల మేరకు సంగవ్వ రూ.1.5 లక్షలు బ్యాంక్‌లో డిపాజిట్ చేసింది. బ్యాంకర్ జనవరి 3, 2020న సంగవ్వ పేరున కాకుండా ఇతరుల పేరిట రూ. 6 లక్షలకు గాను రూ. 3లక్షల బ్యాంక్ చెక్కును జారీ చేశారు. బ్యాంక్‌వారు ఆమె ఖాతా నుంచి మూడు వాయిదాలుగా రూ. 6,660 లోన్‌కు బదిలీ చేసుకున్నారు. ఎన్నిసార్లు విన్నవించుకున్నా సంగవ్వకు లోన్ ఇవ్వకపోవడంతో ఆమె నిజామాబాద్ వినియోగదారులు వివాదాల పరిష్కార కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. నోటీసులు అందుకున్న బ్యాంకు అధికారులు లోన్ మంజూరు చేయకపోవడంలో తమ పొరపాటు లేదని జవాబు దాఖలు చేశారు. సంబంధిత పత్రాలను పరిశీలించి సంగవ్వకు రూ. 6లక్షల లోన్ మంజూరీ చేయాలని కమిషన్ తీర్పు వెలువరించింది. లోన్ ఇవ్వకున్నా ఆమె బ్యాంకు ఖాతా నుంచి మూడు వాయిదాల డబ్బులు కోత విధించిన రూ. 6,660 డబ్బులను 9 శాతం వడ్డీతో చెల్లించాలని, సంగవ్వను ఆర్థిక, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ. 15 వేలు పరిహారం చెల్లించాలని, రూ.3వేలు ఖర్చులకు చెల్లించాలని కమిషన్ సభ్యుడు నాగేశ్వర్‌రావు తీర్పు రాయగా, కమిషన్ అధ్యక్షురాలు సువర్ణ జయశ్రీ, మరో సభ్యురాలు సుమా రవీందర్‌రావు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. తమ తీర్పు ప్రతి స్వీకరించిన 45 రోజుల్లో కమిషన్ ఆదేశాలు అమలు చేయాలని సూచించింది.

# పనిదినాలు కల్పించేందుకే ఉపాధి పనులు





మాట్లాడుతున్న డీఆర్డీవో సాయన్న

పిట్లం, జనవరి 11: కూలీలకు పని దినాలు కల్పించేందుకే ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టిందని డీఆర్డీవో సాయన్న అన్నారు. పిట్లంలోని మండలపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కవిత అధ్యక్షతన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నిర్వహించారు. మండలంలో 14వ విడుత చేపట్టిన ఉపాధిహామీ పథకం పనుల సామాజిక తనిఖీ నివేదికలను డీఆర్పీలు చదివి వినిపించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్, ఏపీవో శివకుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎలమ అమావాస్య



ధర్మారంలో..



రాజుల్లాలో..

ఎలమ అమావాస్యను జుక్కల్, బిచ్కుంద, పిట్లం మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి జొన్న, గోధుమలు, బియ్యంతో తయారుచేసిన నైవేద్యాన్ని సమర్పించారు. సహపంక్తి భోజనాలు చేశారు.

## బడి బయటి పిల్లల సర్వే

నిజాంసాగర్, జనవరి11: మహ్మద్‌నగర్, నిజాంసాగర్ ఉన్నత పాఠశాలల క్లస్టర్ పరిధిలో గురువారం సీఆర్పీలు బడి బయటి పిల్లల కోసం సర్వే నిర్వహించారు. గోర్గల్ గ్రామంలో ఓ బాలికను గుర్తించి హెచ్ఎం రాంచందర్ సమక్షంలో నిజాంసాగర్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. నర్వ గ్రామంలో బడి మానేసిన ఈశ్వర్‌ను గుర్తించి హెచ్ఎం మధుసూదన్‌రాజు సమక్షంలో మహ్మద్‌నగర్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటేశం, సీఆర్పీలు శంకర్‌గౌడ్, వరలక్ష్మి, కో-ఆర్డినేటర్ రాజు పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాల తనిఖీ

నిజాంసాగర్, జనవరి11: మండలంలోని మాగి, గోర్గల్, వొడ్డేపల్లి, మల్లూర్ గ్రామాల్లో ఉన్న రేషన్ దుకాణాలను తహసీల్దార్ భిక్షపతి గురువారం తనిఖీ చేశారు. దుకాణాల్లో రేషన్ కార్డుల సంఖ్య, ప్రతినెలా ఎన్ని క్వింటాళ్ల రేషన్ బియ్యం వస్తున్నాయి..? బినామీ రేషన్ కార్డులు, మృతి చెందిన వారి పేర్ల తొలగింపు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. దుకాణాల వారీగా రికార్డులను తనిఖీ చేశారు. ఆయనవెంట గిర్దావర్ అంజయ్య, డీలర్లు దేవేందర్‌రెడ్డి, శేఖర్, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

పిట్లం, జనవరి 11: మండలంలోని కుర్తి గ్రామంలో పిట్లం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు రోహిత్‌కుమార్, హరికిషన్‌రావు కలిసి వృద్ధులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంజీవ్‌రెడ్డి, పిట్లం చైర్మన్ బుడాల నవీన్, కుర్తి సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.